క్లుప్తంగా

రక్తదానానికి ముందుకు రావాలి..



రక్తదానం చేస్తున్న మహిళలు

గంట్యాడ: ఆరోగ్యంగా ఉన్నవారు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని.. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని మురపాక సర్పంచ్ ఈదుబిల్లి రమేష్ అన్నారు. మండలంలోని మురపాకలో అవయవ దాత గండి పల్లవి జయంతి సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం, నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బెహరా రమ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సునంద, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు

గజపతినగరం: మండలంలోని పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ బి. రత్నకుమార్ తెలిపారు. మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన ఇజ్జిరోతు గోవింద, ఎం.గుమడాం గ్రామానికి చెందిన ఆవాల రాము, పట్నాన తవుడులకు చెందిన ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. అనుమతుల్లేకుండా ఎవ్వరు ఇసుక తరలించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నూతన కార్యవర్గం

చీపురుపల్లి: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కోరాడ శంకరరావు, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా కందుల నాగశంకర్ ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా డి.సీతారామరాజు, సూరు రామకృష్ణ, ఎస్.దుర్గారావు, కందుల తవిటిరాజును ఎన్నుకున్నారు. క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ డీఎస్ఎస్.వర్మ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, కె.వెంకటరావు, యు.గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, మహదేవ్ ఫణీంద్రుడు సోమవారం స్థల పరిశీలన చేపట్టారు. మొదట పరిశీలించిన కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో కాకుండా, పెట్రోల్ బంక్ పక్కనున్న కేవీఎస్ కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు



నల్లబిల్లిలో పశువులకు గర్భకోశ చికిత్సలు చేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

వేపాడ: పశుగ్రాస వారోత్సవాలు సోమవారంతో ముగిసినట్లు వేపాడ పశువైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. ఆఖరి రోజున నల్లబిల్లిలో పశు వైద్యశిబిరం నిర్వహించి 32 పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు అందించినట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షురాలిగా అలివేణి

దత్తిరాజేరు: మండలంలోని పోరలి పీఏసీఎస్ అధ్యక్షురాలిగా గోభ్యాం గ్రామానికి చెందిన వంగపండు అలివేణి నియమితులయ్యారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అలివేణి ఈ సందర్భంగా తెలిపారు.

వైఎస్సార్‌సీపీది ప్రజాపక్షం..

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ కడుబండి



గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో నిర్వహించిన ఎల్.కోట మండలస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట:

అధికారం ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే.. నాడు అధికారంలో ఉన్నా.. నేడు ప్రతిపక్షంలో ఉన్నా జగన్ మోహన్‌రెడ్డి ఎప్పుడూ ప్రజా సంక్షేమమే కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్ కడుబండి శ్రీనివాసరావు అన్నారు. లక్కవరపుకోట మండల పరిధి గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి నేతృత్వంలో మండల స్థాయి విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడుబండి మాట్లాడుతూ.. కూటమి సర్కారు ఏడాది అసమర్థ పాలనను ప్రజలకు వివరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల వేళ కూటమి నాయకులు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాది పాలనలో చంద్రబాబు చేసింది శూన్యం అయినా, ప్రజలు నోరెత్తలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు నైతిక ధైర్యం ఇచ్చేందుకు జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహించడంతో కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద తల్లికి వందనం ప్రకటించిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఎక్కువగా వస్తుండడంతో ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని.. మన జిల్లాలో మాత్రం బొత్స సత్యనారాయణ నాయకత్వం వల్ల అటువంటి పరిస్థితి రాలేదన్నారు. చంద్రబాబునాయుడు చేసిన మోసాలపై ఇంటింటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనురాజు, ఆవాల శ్యామల, పినిశెట్టి కృష్ణప్ప, యడ్ల కిశోర్, బోకం అప్పారావు, కొట్యాడ మహేష్, ఆవాల సత్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు అప్పలరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోట సమావేశంలో మాట్లాడుతున్న కడుబండి శ్రీనివాసరావు

- మాజీ ఎమ్మెల్యే కడుబండి

కూటమి కుట్రలు కూల్చడమే లక్ష్యం...

శృంగవరపుకోట: ప్రజలను మోసం చేసి అధికారం దక్కించుకున్న కూటమి కుట్రలను కూల్చడమే మన లక్ష్యం కావాలి.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎస్.కోట పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల వేళ మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి నాయకులు అధికారం చేపట్టారన్నారు. సెల్‌ఫోన్ యాప్‌లో పథకాలు చూపించి, ఏడాదికి రూ.3 లక్షల లబ్ధి చేకూరుస్తామని చెప్పి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. అయితే ఏడాది పాలనలో హత్యలు, దాడులు తప్ప రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి సర్కారు చేసిన మోసాలను వివరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు షేక్ రహమాన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కె.జయశంకర్, వాకాడ రాంబాబు, సర్పంచ్ కె.వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు పి.ధర్మారావు, డోల కనకమహాలక్ష్మి, ఎంవీ దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు చింతల సత్యవతి, వేమలి సావిత్రి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- గజపతినగరం మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

గంట్యాడ: మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధహస్తుడని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కొండతామరపల్లి జంక్షన్‌లో గల కల్యాణ మంటపంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పథకాల ద్వారా అందించిన డబ్బులు తీసుకోవడానికి వెళ్లిన మహిళలతో బ్యాంక్‌లు బిజీగా ఉండేవని తెలిపారు. ఇప్పుడు సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని.. ఇంతటి దుర్మార్గపు పాలన ఎప్పుడూ చూడలేదన్నారు.పొత్తులతో తప్ప ఎప్పుడూ సింగిల్‌గా పోటీ చేసి గెలిచిన చరిత్ర టీడీపీకి లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఫోటోలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి మాట్లాడుతూ.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాటలన్నీ అబద్ధాలేనన్నారు. ఒక్కరికి కూడా కొత్త పింఛన్ ఇవ్వలేదని తెలిపారు. చంద్రబాబు మోసాలను ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎంపీపీ పీరుబండి హైమావతి మాట్లాడుతూ.. చంద్రబాబు మోసం చేస్తాడని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెప్పినా ప్రజలు వినలేదన్నారు. ఇప్పుడు ప్రజలు తమ తప్పు తెలుసుకున్నారన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ మాట్లాడుతూ.. మండలానికి చెందిన కొండపల్లి శ్రీనివాస్ మంత్రిగా ఉన్నప్పటికీ కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రైతు కార్యదర్శి జాగరపు సత్యారావు, మండల అధ్యక్షుడు జాగారపు అప్పారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల ఉపాధ్యక్షుడు వర్రి మల్లునాయుడు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఈదుబిల్లి రమేష్‌కుమార్, సీనియర్ నాయకుడు నారాయణమూర్తి రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్, తామరపల్లి సర్పంచ్ ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ఎంతో మేలు..

- న్యాయమూర్తి కనకలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: మధ్యవర్తిత్వం అనేది తగాదాలు రాజీ అయ్యేందుకు చక్కని మార్గమని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిఫ్ కోర్టులో మండల న్యాయసేవా కమిటీ చైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి నేతృత్వంలో 'మధ్యవర్తిత్వం దేశం కోసం' అనే అంశంపై న్యాయవాదులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్‌బౌన్స్, ఫ్యామిలీ, క్రిమినల్ కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించగలిగిన కేసులను మరోమారు పరిశీలించాలని సూచించారు. కక్షిదారులకు ఇబ్బంది లేకుండా మధ్యవర్తిత్వంతో పరిష్కరించాలన్నారు. ఎస్.కోట కోర్టులో పెండింగ్‌లో ఉన్న సుమారు 1300 కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించే ప్రయత్నం చేయాలని తెలిపారు. రాజీ అయితే రాతపూర్వక ఒప్పందం నమోదు చేసి, కోర్టు ప్రొసీడింగ్స్ ఇస్తామని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. సమావేశంలో న్యాయవాదులు బీవీఎస్ రామారావు, మూర్తి, బి.త్రిమూర్తులు, డబ్ల్యూఎస్ శర్మ, ఆర్. సత్యనారాయణ, బి.సత్యనారాయణ, గేదెల ప్రకాశ్, బి.రామకృష్ణ, ఎ.మహాలక్ష్మినాయుడు, సీహెచ్‌ఆర్‌పి నాయుడు, వి.రమణ, లక్ష్మి, బి.రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌తో మంచి అవకాశాలు

- సీఐ నారాయణమూర్తి



దివ్యాంగులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: పారా క్రీడాకారులకు ప్రభుత్వాలు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని.. ఆటల్లో పాల్గొనేందుకు దివ్యాంగులను శారీరకంగా, మానసికంగా సిద్ధం చేయాలని సీఐ వి. నారాయణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. దివ్యాంగులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని చెప్పారు. అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ మాట్లాడుతూ.. ఈ నెల 20న విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరగనున్న పారా స్పోర్ట్స్‌లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పి.ప్రతాప్‌వర్మ, ఎస్ఆర్‌పీలు లీలాకృష్ణ, శ్రీకన్య, శ్రావణి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గరివిడికి పూర్వ వైభవం తీసుకువస్తాం..



విశ్వభారత్ సేవాట్రస్ట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రీయూనియన్ ఆఫ్ గరివిడి సంఘ ప్రతినిధులు స్పష్టం చేశారు. గరివిడిలో గతంలో మాదిరిగా సేవా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక శ్రీరామ్ హైస్కూల్ ఆవరణలో విశాఖపట్నం విశ్వభారత్ సేవాట్రస్ట్ సహాయ, సహకారాలతో రీయూనియన్ ఆఫ్ గరివిడి సంఘ ప్రతినిధులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. గరివిడికే తలమానికంగా ఉన్న అనేక నిర్మాణాలు నేలమట్టమయ్యాయని, విలువైన స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ప్రజలు వాకింగ్, రన్నింగ్‌కు గ్రౌండ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వినాయక ఉత్సవాల కోసం ఫేకర్ యాజమాన్యం విడిచిపెట్టిన స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆయా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించాలని విశ్వభారత్ సేవాట్రస్ట్ చైర్మన్ బలివాడ రమేష్‌ను కోరారు. దీనికి రమేష్ స్పందిస్తూ... గ్రౌండ్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. గరివిడిలో పుట్టిపెరిగి ఉన్నత స్థాయికి ఎదిగి సొంత ఊరిపై ఉన్న అభిమానంతో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వచ్చిన బలివాడ రమేష్ అభినందనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కంబాల శివ, ఎం.జగన్నాథరాజు, కె.పాపారావు, జీఏఎస్ రాజు, ఎం.వెంకటేశ్వరరావు, మౌలీ, సయ్యద్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు

చీపురుపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చీపురుపల్లి సర్కిల్ పరిధిలో గల మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు లేవని పేర్కొన్నారు. మద్యం దుకాణాలపై ఎప్పటికప్పుడు డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తూ నిరంతరం మద్యం విక్రయాలపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు.

30 మందికి నేత్ర పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వేపాడ: మండల కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 30 మందికి వైద్యసేవలందించారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి 15 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారని క్యాంప్ కో ఆర్డినేటర్ జోగారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: పట్టణంలో పుణ్యగిరి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఏపీ హోమ్స్, పందిరప్పన్న జంక్షన్, రామ్‌నగర్, పోలీస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, ఎస్.కోట సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాకు గుర్తింపు లేదు..

- జనసేన నాయకులు



మాట్లాడుతున్న జనసేన నాయకులు

జామి: మండల పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని భీమసింగిలో సోమవారం సాయంత్రం పలువురు నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపులో కీలక పాత్ర పోషించనప్పటికి తగిన గుర్తింపు లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని, ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పోతల రాంబాబు, జన్నేల బాలకృష్ణ, పిన్నింటి ఆదినారాయణ, పోలిపర్తి గోవింద, ఆర్.శ్రీనివాస్, నవీన్, పి.ఎర్నాయుడు పాల్గొన్నారు.

అన్నదానం..



ఎస్.కోట పట్టణంలోని విశాఖ – అరుకు రోడ్డులో గల షిర్డీసాయి మందిరం నిర్వాహకులు గురుపౌర్ణమి ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. – శృంగవరపుకోట

నిరసన..

జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేయమంటే బైండోవర్ కేసులు పెట్టి పోలీసులు బెదిరిస్తున్నారని నిర్వాసితుల సంఘం నేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులు, ప్రభుత్వం తీరును నిరసిస్తూ బొడ్డవర జంక్షన్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు.
– శృంగవరపుకోట



ఫేకర్ పరిశ్రమ తెరిపించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో మూతపడిన ఫేకర్ పరిశ్రమను ప్రభుత్వం తెరిపించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు టీవీ రమణ కోరారు. ఫేకర్ పరిశ్రమ గేట్ ఎదురుగా సోమవారం జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫేకర్ యాజమాన్యం 2023 నవంబర్‌లో 100 శాతం లేఆఫ్ ప్రకటించిందని, నేటి వరకు కూడా తెరవలేదన్నారు. గడిచిన 20 నెలలుగా లే ఆఫ్ వేతనాలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు స్పందించి పరిశ్రమ తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూలో చేరికలు.. గరివిడి ఫేకర్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తూ 2021 ఫిబ్రవరిలో పర్మినెంట్ అయిన 116 మంది కార్మికులు సీఐటీయూ సంఘంలో చేరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, తదితరులు పాల్గొన్నారు.